క్లుప్తంగా

కపిలమల్లేశ్వరస్వామి దర్శనానికి అవస్థలు



డ్రెయిన్‌పై మెట్లు తొలగించిన దృశ్యం

నరసాపురం: పట్టణంలోని శ్రీ కపిలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద పడగొట్టిన మెట్లు తిరిగి కట్టకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రసిద్ధ ఈ శివాలయాలని ప్రతీరోజూ పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇటీవల గుడి ఎదురుగా ఉన్న డ్రెయిన్ మరమ్మతులు చేశారు. మరమ్మతుల్లో భాగంగా గుడిమెట్లను తొలగించారు. తొలగించిన మెట్లు తిరిగి నిర్మించలేదు. ఆలయ అధికారులు కూడా మున్సిపాలిటీకి ఫిర్యాదు చేయడం గానీ, డ్రెయిన్ పై నుంచి గుడి లోపలికి వెళ్లే విధంగా ఉన్న మెట్లను తిరిగి నిర్మించే విషయంలో చర్యలు చేపట్టలేదు. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా మెట్లను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

ముగిసిన మావుళ్లమ్మ జాతర



సిద్ధాంతంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారికి తొలుత భారీ కుంభం నైవేద్యంగా సమర్పించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. మావుళ్లమ్మ ఫ్రెండ్స్ యూనియన్ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా పల్లకీ సేవ



జుత్తిగలో సాయిబాబాకు పల్లకీ సేవ చేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని జుత్తిగ గ్రామంలో ఉన్న పెద్ద చెరువు గట్టు శ్రీ షిర్డీసాయిబాబా వారి వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పల్లకీలో ఉంచి ఇంటింటికీ తీసుకువెళ్లి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొవ్వూరు చిన్నారెడ్డి, నల్లమిల్లి విజయ్ కుమార్ రెడ్డి, తమనంపూడి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోమటిగుంటలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు శ్రీకారం



కోమటిగుంటలో వాకింగ్ ట్రాక్ పనులు జరుగుతున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. గ్రామంలో చెరువు తవ్వి, చుట్టూ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరం కోసం మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ ట్రాక్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఎక్కడా మురుగు లేకుండా, పంటకాలవలు కాలుష్యం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

క్లబ్‌ల నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

ఆకివీడు: స్థానిక లయన్స్, అభయ, గోల్డెన్ ఆక్వా లయన్స్ క్లబ్‌ల నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక లయన్స్ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్టిపుల్ కౌన్సిల్ మాజీ చైర్‌పర్సన్ డీవీఎస్ రాజు(రమేష్) మాట్లాడుతూ ఆకివీడులో లయన్స్ క్లబ్‌ల ద్వారా సేవలందించేందుకు పలువురు ఆసక్తి చూపుతూ సభ్యులుగా చేరడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు విద్య, వైద్యం, ఆహారం, కంటి వెలుగులు అందించేందుకు లయన్స్‌క్లబ్‌లు నిరంతరం కృషి చేస్తున్నాయని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంబీ.సూర్యనారాయణరాజు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ పాస్ట్ మల్టీపుల్ చైర్‌పర్సన్ సీహెచ్.కృష్ణంరాజు, జిల్లా రెండవ గవర్నర్ ఆర్‌వీఎస్ సూర్యనారాయణరాజు, వీవీ కృష్ణంరాజు, పేర్ని సుబ్రహ్మణ్యం, మోటుపల్లి శ్రీనివాసరావు, మోరా జ్యోతిరెడ్డి, కాకర్ల రాజరాజేశ్వరి, నర్సింహం, ఎండీ.జక్కీ, పలువురు లయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు.

ఇదెక్కడి పారిచోద్యం?

- నరసాపురంలో పొంగుతున్న డ్రెయిన్లు
- తూతూ మంత్రపు పనులతో ఇబ్బందులు

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గత కొన్నిరోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు పట్టణంలో డ్రెయిన్స్ పొంగుతున్నాయి. ప్రధానంగా ఇటీవల చేపట్టిన డ్రెయిన్స్ పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేయడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పూడికతీసిన మురుగుమట్టి తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ ఎప్పటి నుంచో అస్తవ్యస్తంగా ఉంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అవసరమైన చోట డ్రెయిన్స్‌ను కొత్తగా నిర్మించడం గానీ, పాత డ్రెయిన్స్ మరమ్మతులు చేయడం గానీ చేపట్టలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019–24 కాలంలో పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు కొంతమేర చర్యలు చేపట్టారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి స్పెషల్ ప్రాజెక్ట్ కూడా మంజూరు చేశారు. ప్రభుత్వం మారడంతో ఆ ప్రాజెక్ట్ అటకెక్కింది.



పొన్నపల్లిలో డ్రెయిన్‌లో మురుగు తీసి పక్కనే వదిలేసిన దృశ్యం

ప్రస్తుతం ఉన్న డ్రెయిన్స్‌ను బాగు చేయడంలో ఇటీవల మున్సిపల్ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు.

సిల్ట్ తొలగింపు పనులు నామమాత్రం

వేసవి కాలంలో ప్రధాన డ్రెయిన్స్‌లో సిల్ట్ తీసే పనులను అధికారులు నిర్వహించారు. అయితే పనులు తూతూ మంత్రంగా చేయడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం పట్టణంలో చాలా చోట్ల డ్రెయినేజీల్లో మురుగు పారడం లేదు. డ్రెయినేజీల ద్వారా నీరు పారక రోడ్డు మీదకు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయినేజీల్లో తీసిన సిల్ట్ కూడా అక్కడే వదిలేయడంతో పరిస్థితి మరింత దిగజారింది.

కాంట్రాక్టర్‌కు సొమ్ములు చెల్లించం



డ్రెయిన్స్ పూడికతీత పనులపై ఫిర్యాదులు వస్తున్నాయి. కౌన్సిల్ సమావేశంలో కూడా సభ్యులు దీనిపై తీవ్ర అభ్యంతరం చెప్పారు. డ్రెయిన్స్ పూడికతీత పనులు ఎక్కడ సవ్యంగా సాగలేదో అక్కడ చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు సొమ్ములు చెల్లించం. పనులు సవ్యంగా సాగేలా చర్యలు తీసుకోమని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. రోడ్లపైఉన్న మురుగుమట్టిని తక్షణం తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసినా..

గత శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పట్టణంలో డ్రెయినేజీ పూడిక తీత పనుల్లో జరుగుతున్న లోపాలపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. డ్రెయినేజీ పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అసలు వర్షాలు పడుతున్నప్పుడు డ్రెయినేజీల్లో పూడికతీత పనులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. డ్రెయినేజీలను పూర్తిస్థాయిలో మళ్లీ బాగుచేయాలని డిమాండ్ చేశారు. అయినాకూడా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



ముద్దాడ గణేష్ భవాని

పాలకొల్లు సెంట్రల్: నేటి సమాజంలో విద్యను వ్యాపారం చేసేయడంతో పేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో విద్యా వ్యవస్థపై మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రైవేటు స్కూల్, కాలేజీల్లో ఫీజులు నియంత్రించాలని అలాగే ఫీజులు బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యూనిఫార్మలు, పుస్తకాలు విక్రయాన్ని అరికట్టాలన్నారు. విద్యా వ్యవస్థలో ఎన్ని చట్టాలు, ఎన్ని జీఓలు తీసుకువచ్చినా అవన్నీ ప్రైవేటు విద్యాసంస్థల ముందు బలాదూర్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం విద్యను అమలు చేయాలని అన్నారు. అమలు చేయని విద్యా సంస్థల అనుమతులను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రామలింగేశ్వరుని మాడ వీధుల పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారాలు ప్రదిక్షణల్లో భాగంగా భక్తులు ప్రదిక్షణలు చేసే మాడ వీధులను ఆదివారం అధికారులు పరిశీలించారు. సోమవారం సాయంత్రం ప్రదోష కాలంలో ఈ ప్రదిక్షణలు ప్రారంభిస్తున్నారు. గత మూడు సోమవారాలు ప్రదిక్షణల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాలుగో సోమవారం వేలమంది పాల్గొనే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు సౌకర్యార్థం మాడ వీధుల్లో వ్యాపారస్తులను సోమవారం మధ్యాహ్నం నుండి మాడ వీధుల్లో ఎలాంటి వస్తువులు, దుస్తులు, వాహనాలు ఏర్పాటు చేయరాదని పోలీసులు ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టణ సీఐ కె రజనీకుమార్ తెలిపారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, ఏఎస్సై పాల్గొన్నారు.



మాడ వీధులను పరిశీలిస్తున్న సీఐ రజనీకుమార్, ఆలయ ఈఓ

వారాహి మాతకు విశేష పూజలు





సరస్వతిదేవి అలంకరణలో శ్రీవారాహి మాత, వారాహి మాతకు పూజలు చేస్తున్న విద్యార్థులు

పెనుమంట్ర: మండలంలోని మల్లిపూడి గ్రామంలో ఉన్న శ్రీ వారాహి మాత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి విద్యార్థులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారణాసి రామలింగేశ్వర శర్మ బ్రహ్మత్వంలో విద్యార్థులు అమ్మవారిని పూజించారు. ఈ నెల 26న ప్రారంభమైన ఈ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాలు జూలై 5 వరకు నిర్వహిస్తామన్నారు. సోమవారం పంచమి నేపథ్యంలో గ్రామంలో మహిళలతో గడపగడపకు వెళ్లి అమ్మవారి సారె పంపిణీ చేస్తామని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు గుడిమెట్ల సాయిబాబారెడ్డి తెలిపారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ పెనుగొండ మండల నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. పెనుగొండ రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షుడిగా కొమ్ముల రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా షేక్ మస్తాన్, కార్యదర్శిగా నూలి నవీన్‌కుమార్, కోశాధికారిగా యలమర్తి నరసింహారావు, జాయింట్ సెక్రటరీగా పలివెల శ్రీనివాస్, ఈసీ హెల్త్‌గా డాక్టర్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, ఈసీ ఎడ్యుకేషన్‌గా జక్కం విజయ్‌యుమార్, ఈసీ ఎమర్జెన్సీగా కంబాల మోహన్, ఈసీ ఎవేర్‌నెస్‌గా వేండ్ర రామనాగేశ్వరరావు, చైర్మన్‌గా నేమాని శ్రీనివాస్, కో చైర్మన్‌గా బచ్చు లక్ష్మీ నరసింహమూర్తి, కన్వీనరుగా నల్లిమిల్లి విజయరాజులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కే రామచంద్రరాజు, కోడూరి రాధా పుష్పవతి, కర్రి నరేంద్ర రెడ్డి, టీవీకే రంగారెడ్డి, టి.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ మండల మానవత నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

భీమవరం: సమాజసేవలో లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆకుల వెంకట శేషసాయి అన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట శేషసాయి మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో పదవులు చేపట్టినవారు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ కన్వీనర్ చిలువూరి కృష్ణంరాజు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో లయన్ ఉచిత కంటి ఆసుపత్రికి నూతన భవనం నిర్మాణం చేపట్టి రెండేళ్లలో పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకారం

లయన్స్ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొండా రాంబాబు, అల్లు తులసి ప్రసాద్, కోశాధికారిగా కనగర్ల రామకృష్ణ, జోన్ చైర్మన్‌గా నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, కో ఆర్డినేటర్‌గా పేరిచర్ల మూర్తిరాజు, వైస్ ప్రెసిడెంట్స్‌గా వీఎస్ నాగేశ్వరరావు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా నందమూరి రాజేష్, సర్వీస్ చైర్మన్‌గా సరోజిని మహ్మద్, మార్కెటింగ్ చైర్మన్‌గా నార్కెడిమిల్లి మహేష్‌కుమార్, పేరిచర్ల కృష్ణంరాజులతో రిటైర్డ్ జడ్జి వెంకటశేషసాయి ప్రమాణ స్వీకారం చేయించారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి

యలమంచిలి: వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కార్యకర్తలంతా కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షులు ఉచ్చుల స్టాలిన్‌బాబు కోరారు. నారినమెరక గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి త్వరలోనే పార్టీ రాష్ట్రవ్యాప్తంగా రీకాల్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమం చేపట్టనుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయడానికి కార్యకర్తలంతా కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం నారినమెరక గ్రామ కమిటీ, యలమంచిలి మండల కమిటీ, అనుబంధ కమిటీలు నియామకం గురించి సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఇనుకొండ రవి కుమార్, వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు కవురు గోపి, చల్లా విశ్వేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, గటిగంటి మహేష్, ఆరిమిల్లి లక్ష్మణరావు, వడ్డి వసంతం, వడ్డీ శేకర్, పెచ్చెట్టి రాంబాబు, గుర్రాల వెంకట్రావు, జడ్డు నాగరాజు, వలవల ధర్మారావు, కొంబత్తుల దుర్గాప్రసాద్, వీరా ఉమా శంకర్, కల్యాణం గంగాధరరావు, గుడాల సురేష్, కుక్కల బాలచంద్రన్, సిర్రా నాగరాజు, పాలపర్తి సందీప్, పోలుకొండ వెంకట్, కొయ్యే నాగేశ్వరావు, బుంగా సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నారినమెరక వైఎస్సార్ సీపీ సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

సమస్యల వలయంలో పెదపేట





స్థానిక పెదపేటలో చెత్త పేరుకుపోయిన దృశ్యం, స్థానిక పెదపేటలో అధ్వానంగా ఉన్న పైపులైన్లు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పట్టణ నడిబొడ్డున ఉన్న పెదపేటలో సమస్యలు తిష్ఠ వేశాయి. దుక్కి వర్షానికే ఆ ప్రాంతంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోతున్నాయి. డ్రెయినేజీలో చెత్త, మట్టి తొలగింపులో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. పెదపేటకు చేర్చి ఉన్న గంగానమ్మకోడు డ్రెయినేజీలో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు నిలబడిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రెయిన్‌కు చేర్చి చెత్తాచెదారం వేయడంతో ఆ ప్రాంతం అపారిశుద్ధ్యానికి నిలయంగా మారింది. పెదపేటలో పైప్‌లైన్ల విస్తరణ అధ్వానంగా ఉంది. అంగుళం పైపులైన్‌తో 200, 300 మీటర్లకు పైగా దూరం నుంచి కుళాయి నీరు పొందాల్సి వస్తుందని వాపోతున్నారు. కుళాయినీరు కూడా సక్రమంగా అందడంలేదంటున్నారు. పైప్‌లైన్‌ల పునర్నిర్మాణానికి అమృత పథకం నిధులు వెచ్చిస్తామని గతంలో కమిషనర్ వెల్లడించినా పనులు మాత్రం జరగలేదు. పట్టణ నడిబొడ్డులో మంచినీటి వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత పేట ప్రాంతాల్లో వెచ్చించాల్సిన నిధులు సక్రమంగా వినియోగించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. పెదపేటలోని సమస్యల పరిష్కారానికి నిధులు వెచ్చించాలని వారు కోరుతున్నారు.

కళాకారులతో సమాజంలో చైతన్యం



కళా సత్కారం నిర్వహిస్తున్న రంగస్థల కళాకారులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కళాకారుల ద్వారా సమాజంలో చైతన్యం కలుగుతుందని, వారు బాగుంటేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 157వ నెలవారీ సభా కార్యక్రమం స్థానిక నందిబొమ్మ కూడలి శ్రీవిఘ్నేశ్వర రామాలయంలో నిర్వహించారు. హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగి శ్రీనివాసరావుకు గౌరవ సత్కారం, విశ్రాంత కార్య నిర్వాహక ఇంజనీర్, గాయకుడు తాడూరి వెంకట శేషగిరిరావుకు కళా సత్కారం, ఉద్యోగ సేవా పురస్కారం రామచంద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ యూనిట్ పర్యవేక్షకుడు పెమ్మరాజు సురేష్‌కు ఉద్యోగ సేవా పురస్కారం అందజేశారు. నృత్య కళాకారుడు జూనియర్ నాగార్జునకు ఆర్థిక సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, దేవికారాణిరావు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలనుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని 33/11 కేవీ ఆగర్తిపాలెం, సగం చెరువు సబ్‌స్టేషన్ పరిధిలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం నిమిత్తం కొన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 8 గం నుంచి మధ్యాహ్నం 2గంటలవరకూ ఆగర్తిపాలెం, సగంచెరువు, వెలివల, గొల్లగూడెం, తిల్లపూడి, తిల్లపూడిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

అత్తిలి: స్థానిక పడవల రేవులో స్వయంభుగా వెలసిన శ్రీవిజయ చాముండేశ్వరీ దేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయ చాముండేశ్వరీ దేవి అమ్మవారి గుడి దగ్గర నుంచి పసుపు, కుంకుమ, చలివిడి, పానకం, సారి, పాలు, పసుపు నీళ్లు, కావళ్లతో తీసుకువచ్చి అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సామాన్యులకు అందని కార్పొరేట్ వైద్యం

- వైఎస్సార్ సీపీ హయాంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- స్పెషలిస్టు వైద్యులతో రోగులకు సేవలు
- వైద్య శిబిరాలు ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- సీజనల్ వ్యాధులతో ప్రజల ఇబ్బందులు

వీరవాసరం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంపై దృష్టి సారించలేదు. సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కనీసం వైద్య శిబిరాలు నిర్వహించకపోవడం గమనార్హం. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసేవారు. అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం సామాన్యులకు భారంగా మారింది.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన ఆరోగ్య సురక్ష వంటి మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతోపాటు మందులు కూడా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించకపోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు.

– కటకం సుబ్రహ్మణ్యం

ఆదేశాలు లేవు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై ఇంతవరకు ఆదేశాలు లేవు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– గెద్దం భారతి, రాయకుదురు సర్పంచ్